BHAVA VEENA SPECIAL ADDITION
UGC Approved Journal No. 42500

# త్యాగయ్య కృతుల్లో సంస్కరణ

Dr. G. JANSI VANI
Reader & HOD, Dept of Telugu
Bapatla college of Arts and Sciences-Bapatla

ఏ సంస్కరణైనా సాహిత్య ఊతంతోనే ఊపిరి పోసుకుంటుంది. సంస్కరణ అనే బీజాన్ని సాహిత్యం అనే క్షేత్రంలో నాటితే అది ఇంతింతై అన్న చందంగా ఎదిగి సమాజానికి చక్కటి ఫలాలనందిస్తుంది.'సాహిత్యం అంటే ఇతివృత్త సంభరితమైన గద్య, పద్య నాటకాది రచనలే అని భ్రమపడరాదు' అంటూ గంగప్ప గారు తెలిపినట్లు నిరక్షరాస్యులు , అక్షరాస్యులు రూపొందించిన పాటలు కూడా సాహిత్య కోవలోనికే వస్తాయి.

సంస్కరణతో కూడిన ఏ సాహిత్యమైనా పది కాలాలపాటు నిలబడుతుంది. విశ్వశ్రేయస్సు కొరకే మన కవులు, శతకకారులు, వాగ్గేయకారులు ఎన్నో రచనలు చేశారు. ప్రతి కావ్యంలోనూ సమకాలీన సామాజిక వ్యవస్థ, మతం, ధర్మం, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు ప్రతిబింబిస్తూనే ఉంటాయి. మన భారతీయ భాషలన్నింటిలోనూ అనాదిగా ఏదో ఒక ధర్మాన్నిగాని, సందేశాన్ని గాని అంతర్లీనంగా కావ్యాల్లో పొందుపరచడం జరుగుతుంది. ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిత్వ నిర్మాణానికి సాహిత్యం ఎంతో తోడ్పడుతుంది. అటువంటి ఆలోచనామృతమైన సాహిత్యంతో పాటు ఆపాత మధురమైన సంగీతాన్ని కూడా జోడించి కొందరు మహానుభావులు సంస్కర్తలుగా కీర్తి గడించారు. వారిలో త్యాగయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసులు ఘనులు.

సాహిత్యానికి, భక్తికి అవినాభావసంబంధముంది. ముఖ్యంగా ప్రాచీన సామిత్యంలో కవులు అడుగడుగునా తమ భక్తి ని చాటుకునే ప్రయత్నం చేశారు.సాహిత్యం ద్వారా ముక్తిని పొందాలనే తపన వారి రచనల్లో కనిపిస్తుంది. కేవలం భక్తిని చాటుకోవడమే కాక సమాజ హితాన్ని కూడా కోరుకున్నారు. భక్తిని రంగరించి సాహిత్యం ద్వారా లోక కళ్యాణాన్ని చేకూర్చడానికి తహతహలాడారు. అటువంటి వారిలో త్యాగయ్య కూడా ఒకరు. సంగీత సాహిత్యాల ద్వారా భక్తిని చాటుకునే ప్రయత్నంలో తాను తరించి పాఠకులను తరింపజేశారు.

సంగీత సామ్రాజ్యానికి రారాజైన త్యాగయ్య తమిళదేశంలోని తంజావూరు జిల్లాకు చెందిన "తిరువయ్యారు" (1767)లో జన్మించారు. బాల్యం నుండే రామభక్తుడు. 24 వేల కీర్తనలతో పాటు "ప్రహ్లాద భక్తి విజయం" (గేయ ప్రబంధం), "నౌక విజయం"(యక్షగానం), "సీతారామ విజయం" (నాటకం) మున్నగు రచనలు చేశారు. పేదరికంలో పుట్టి పెరిగిన త్యాగయ్య తనను శరభోజి మహారాజు ఆస్థాన విద్వాంసునిగా నియమిస్తానని ఆహ్వానించినా తిరస్కరించి ఉంఛవృత్తి తోనే తన జీవనయానం సాగించిన గొప్ప వాగ్గేయకారుడు. పరాయిగడ్డపై జన్మించిన త్యాగయ్యకు తెలుగు భాష మీద ఉన్న మమకారం తెలుగు వారికి త్యాగరాజు మీద లేకపోవడం దురదృష్టకరం. తెలుగు భాష గానానికి అనుకూలమైన భాష అని ప్రపంచానికే చాటి చెప్పిన త్యాగయ్యకు తెలుగు నాట ఆదరణ లేకపోవడం తెలుగు వారమైన మనం సిగ్గుపడాల్సిన విషయం. వేల కీర్తనలు ద్వారా రామ భక్తిని చాటుకోవడంతో పాటు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు.

ఆ శ్రీరామ చంద్రుడే తన సర్వస్వంగా భావించారు త్యాగయ్య. తన చివరి క్షణం వరకు ఆ రామ నామాన్ని జపించాలని కంకణబద్ధుడయ్యాడు. మొత్తం 96 కోట్ల శ్రీరామ నామాన్ని జపించి ధన్యాత్ముడయ్యాడు.ఆ భక్తి అంత తేలికగా ఒంటబట్టేది కాదు. భక్తులు లౌకిక జీవితంలోనే ఉన్నా వారు కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటారు. భక్తుల మానసిక చిత్త వృత్తి ఇహలోక సౌఖ్యాలకు అతీతంగా ఉండాలి. సన్యాసిలాగే భక్తుడు సహితం లోకంలోని పలు అంశాలను త్యజించాలి. లౌకిక జీవితానికి భిన్నంగా ప్రవర్తించాలి.

"లోకము విడువని వానిని
లోకము విడువదని విశ్వలోకేశ్వర నీ
లోకము గోరెడు మనుజుడు
లోకమునే విడుచు నీవలోకముగ శివా" (శివ తత్వం-143)

లోక వ్యవహారాల పట్ల ఉపేక్ష వహించకపోతే ఈ లోకం కూడా తనను వదిలిపెట్టదని మల్లిఖార్జున పండితుడు తన శివతత్వసారం లో వివరించినట్లు

"ఊరక యే గల్గునా రాముని భక్తి
సారెకును సంసారమున జొచ్చి
సారమని యెంచువారి మనసున"

అని త్యాగయ్య వ్యామోహము గల సంసారికి రామభక్తి సాధ్యం కాదంటాడు. భక్తిని సాధించడానికి త్యాగమయ జీవితం అవసరం. పారలౌకికానందమే ప్రధానంగా భావించి ఇహలోక సుఖాలను తృణీకరించిన త్యాగయ్య సార్ధక నామధేయుడు .

"సంగీత జ్ఞానము భక్త వినా సన్మార్గము గలదే ? మనస
భృంగి నటేశ సమీరజ ఘటజ మ
తంగ నారదాదులుపాసించు
న్యాయాన్యాయములు తెలుసును, జగములు
మాయా మయమని తెలుసును, దుర్గుణ
కాముకాది షడ్రిపుల జయించెడి
కార్యము తెలుసును, త్యాగరాజునికి
చక్కని రాజ మార్గములుండగ
సందుల దూరనేల? ఓ మనసా
చిక్కని పాలు మీగడ యుండగ
చీయను గంగా సాగరమేల?"

అని నాదోపాసన ద్వారా భక్తి సాగరంలో ఓలలాడిన త్యాగయ్య సర్వ జనాదరణీయుడు. తన భక్తి పారవశ్యంతో శ్రీరాముని మీద అధిక శాతం కీర్తనలు వెలయించినప్పటికి నిజాయితీతో కూడిన సత్ప్రవర్తనతో జీవిస్తూ స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్ని, నడవడికను కలిగి ఉండటమే భగవంతుని చేరుకోవడానికి మొదటి అర్హత అని నిరూపించే కీర్తనలను ఎన్నింటినో వెలయించారు.

త్యాగయ్య నగర వీధుల్లో గానం చేస్తూ ఊంఛవృత్తి చేసి శిష్యులకు, అతిథులకు పెట్టి తాను భుజించేవాడు. తన పవిత్ర జీవనంతో, తపోనిష్ఠతో ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉంటూ నిరాడంబరంగా, నిస్వార్థంగా తన జీవితాన్ని గడిపాడు. త్రికరణశుద్ధితో కూడిన భక్తి, సర్వమానవ సౌభ్రాతృత్వం, వినయం ఆయన భూషణాలు.

అందుకే "ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" అని అనగలిగాడు. అలాగే "దొరకునా ఇటువంటి సేవ" అంటూ తన గురు భక్తిని చాటుకున్నాడు. "తెరతీయగ రాదా....." అంటూ ఆర్ద్రతతో పాడి తనలో మదమత్సరమనే తెరతీయగ రాదా అంటూ ఆ వేంకటేశ్వరస్వామి ని ప్రార్థించి సమస్త భక్త కోటికి తరుణోపాయం చూపిన మార్గ దర్శకుడు త్యాగయ్య . ప్రజాసంక్షేమం పట్టని రాజులు కళాకారులకు, కవులకూ కానుకలు ఇవ్వడం వాటిని పొందిన పండితులు రాజులను సేవించడం వ్యర్థమని తలిచాడు.రాజాశ్రయాన్ని నిరాకరించాడు. రాజుల ఆధిపత్య విధానాన్ని ఎదురించాడు.

"కాసిచ్చెడిదే గొప్పయనురా కలిలో రాజులకు
హరిదాసులు సేవింపరనుచు ప్రభువులు దయమానిరి పరమెంచక" అంటూ గర్హించాడు

"ధన మదమున నుండు మనుజుల నేను యాచన సేయగ లేనురా" అంటూ ధనం కోసం సుఖాల కోసం పాట్లు పడటం అవివేకమంటాడు. ప్రభువులనుండి వచ్చిన కానుకలను, ధనాన్ని నిరాకరించి "నిధి కంటే రాముని సన్నిధి చాలా సుఖమని" తేల్చి చెప్పాడు. సమాజంలో కుల, బల ప్రాధాన్యం కాక రామభక్తి మార్గమే ఉత్తమమైనదంటాడు.

"బలము కులము ఏల రామ-భక్తి కారణము
వెలయు సకల సిద్ధులెల్ల వెంట వచ్చుగాని......."

త్యాగయ్య అతికామం, స్త్రీ లోలత్వం, పర స్త్రీ సాంగత్యాన్ని నిరసించాడు.

"మనసు విషయనటవిటుల కొసంగినను
మా రాముని కృప గలుగునో మనసా"

మరియు

"మనసు నిల్పశక్తి లేకపోతే
మధుర ఘంట విరుల పూజేమి జేయును
ఘన దుర్మదుడై తామునిగితే
కావేరి మందాకిని యెటు బ్రోచును

సోమిదమ్మ సొగసు గాండ్ర ( గోరితే
సోమయాజి స్వర్గార్హుడౌనో
కామక్రోధుడు తపం బొనర్చితే
గాచి రక్షించునో త్యాగరాజనుత"

అంటూ ఇంద్రియ నిగ్రహం భక్తికి పరమ సోపానం అని తేల్చి చెప్పాడు

త్యాగయ్యకు స్త్రీల పట్ల ఎంతో గౌరవము. కానీ పరస్త్రీల మీద వ్యామోహంతో జ్ఞానాన్ని వృథా చేసుకునే వారిని గూర్చి వ్యథజెందుతూ కాంత దాసత్వం ముక్తి మార్గానికి అవరోధం అంటూ

ఎంత నేర్చినా ఎంత జూచిన
ఎంత వారలైన కాంతదాసులే" అని పరితపించాడు.

వేదోక్త కర్మలు మనస్సును నిర్మలం చేస్తాయిగాని స్వయంగా ముక్తి నొసంగవు అంటూ బాహ్య పూజకన్నా మానసిక పూజ విశేష ఫల ప్రదమనే సత్యాన్ని బోధిస్తూ

"వేగలేచి నీట మునిగి భూతి బూసి
వేళ్ళనెంచి వెలికి శ్లాఘనీయులై
బాగుగ పైకమార్జన లోలులైరేగాని....." అనే కృతిలో మన జ్ఞాననేత్రాన్ని తెరిపిస్తాడు..

భక్తిపూర్వకమైన జ్ఞాన నిష్కాయజ్ఞానికి ప్రాధాన్యమిచ్చారే గాని పశు హింసతో కూడిన యజ్ఞం సుఖమునీయజాలదన్నారు.

"యజ్ఞాదులు సుఖమనువారికి సమయజ్ఞానులు గలరా"

అంటూ హింసాయుత భక్తి మార్గాన్ని నిర్ద్వందంగా ఖండించాడు.

"విద్యా గర్వము లేల? నీవ విద్యా వశముగానేల.....
రామనామము సేయ సిగ్గా....."

అంటూ విద్యా గర్వముండకూడదని సుతిమెత్తంగా మందలించాడు.

త్యాగయ్య కృతుల్లో ఎంతో లోకజ్ఞత ప్రదర్శితమౌతుంది. మనం నిత్యం చూసే, అనుభవించే సంఘటనల్ని, అనుభూతుల్ని, స్వభావాల్ని తన కీర్తనల ద్వారా వివరించి మనకు కనువిప్పు కలిగిస్తాడు. మానవ జీవితాలు ఎలా వ్యర్థంగా నడుస్తున్నాయనే దాన్ని

"నిద్దుర చేత గొన్నాళ్ళు విషయ బుద్ధుల చేత గొన్నాళ్ళు
ప్రొద్దున లేచి త్రితాపములను నరుల పొగడి పొగడి కొన్నాళ్ళు
ఎద్దురీతి కన్న తావున భుజియించి ఏమీతెలియక కొన్నాళ్ళు
ముద్దుగ దోచే భవసాగరమున మునిగి తేలుచు కొన్నాళ్ళు
--------------------------------
మది తప్పిన వృద్ధతనమున ముందు వెనుక తెలియక కొన్నాళ్ళు"

అంటూ అజ్ఞాన నరుల జీవన గమనాన్ని కళ్ళముందుంచాడు.

"అల్పాశ్రమమున గల్గు వెసనములు
కల్పాంతరమైన బోదు శేష తల్పశయనుని నెఱనమ్మిన సం
కల్ప మెల్ల నీడేరును మనసా
ధన తరుణుల కాశించున దెల్ల
వెనుక తనువుకలుగునదే గాని
మనసు చేత సేవ్యుని దలచిన సు
మనసత్వము నొసగునే మనసా
గౌరవహీన ధనికుల గాచుటము
నేరములకెడమౌనుగాని...."

అంటూ విశ్వ జననీయమైన సుఖశాంతులకు రాచబాట చూపించాడు.

ఎన్ని శాస్త్రాలు చదివినా, గృహస్థ ధర్మాన్ని ఎంతగా పాటించినా ఎవరికైనా మనశ్శాంతి లభించాలి. శాంత గుణం అలవడాలి. లేకపోతే విజ్ఞానానికి, శీలానికి అర్థం లేదంటాడు.

"శాంతము లేక సౌఖ్యము లేదు సారసదళనయన
దాంతునికైన వేదాంతునికైన
దారసుతులు ధన ధాన్యాదులుండిన
సారెకు జపతపసంపద కలిగిన
ఆగమ శాస్త్రములన్నియు జదివిన "

అంటూ తత్వ బోధకుడైన త్యాగయ్య సామాన్యులకు సైతం అర్థమయ్యేటట్లు బోధించాడు.

తెలుగు భాషలోని సొగసులతో రచించిన వేల కీర్తనల్లో అక్కడక్కడ భాష ప్రౌఢంగా అనిపించినప్పటికి తెలుగు నానుడులు, లోకోక్తులు, పలుకుబడులు, నుడికారాలను విరివిగా వాడుతూ సులభంగా గ్రాహ్యమయ్యేటట్లు చక్కటి కృతులతో భక్తి ప్రబోధం గావించాడు త్యాగయ్య. అందుకే త్యాగయ్య సంగీతం ఆపాత మధురమైతే, ఆయన సాహిత్యం ఆలోచనామృతమై సవ్యసాచిలా భక్తుల హృదయంలో తిష్ఠ వేస్తాడు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. తెలుగులో పద కవిత-డా॥యస్. గంగప్ప
2. త్యాగరాజు సంకీర్తనలు-ఒక పరిశీలన-డా॥ యస్. శమంతక మణి
3. తెలుగు సాహిత్య చరిత్ర-డా॥ద్వానా శాస్త్రి
4. భక్తి కవిత్వము-డా॥పిల్లలమర్రి రాములు